


చిలుకూరులోని జాతీయ మృగవని పార్కులో

# సాసర్ పిట్లు కట్టి..దాహం తీర్చి..

- కుంటల తవ్వకంతోపాటు అటవీలోని పలు ప్రాంతాల్లో సాసర్‌పిట్ల ఏర్పాటు

మండుతున్న ఎండలతో మానవులే తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. అలాంటిది.. అడవిలో ఉన్న వన్యప్రాణుల సంగతేంటి..అని ఆలోచించిన అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. మండలంలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న జాతీయ మృగవని పార్కులోని వన్యప్రాణుల దాహన్ని తీర్చేందుకు కుంటలను తవ్వించారు. వర్షాకాలంలో పడిన ప్రతి చుక్కా సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో అటవీలో సంచరించే జింకలు, దుప్పిలు తమ దాహాన్ని తీర్చుకుంటున్నాయి. అంతేకాకుండా పలు ప్రాంతాల్లో సాస ర్ పిట్లు(నీటి తొట్టెలు) ఏర్పాటు చేశారు. వాటిలో నీటిని సోలార్ పంప్‌ల ద్వారా నింపుతున్నారు. మృగవని పార్కులో జింకలు, దుప్పిలను ఏర్పాటు చేసిన కంచెలో ఉంచుతారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు సెక్షన్ అధికారి కమాలుద్దీన్ తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లోనూ తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. -మొయినాబాద్, మార్చి 29



నీటి తొట్టిలోని నీటిని తాగుతున్న జింకలు



మేత తింటూ..

# కేంద్రం ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నది

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీశ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సతీశ్‌కుమార్

మొయినాబాద్, మార్చి 29 : ఎన్నికల బాండ్ల రూపంలో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ మెగా కంపెనీ నుంచి రూ. 1,228 కోట్ల బాండ్లను చందారూపంలో తీసుకోవడాన్ని వైట్ కాలర్ దోపిడీగా పరిగణించాల్సిన అవసరం ఉందని.. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక దోపిడీగా ప్రజలు భావిస్తున్నారన్నారు. మెగా కంపెనీ రాష్ట్ర ప్రజాధనాన్ని ఏ విధంగా దుర్వినియోగం చేస్తుందో ప్రజ లు ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను నిలిపివేయడంపై ఆయన మండిపడ్డారు. నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన ఈడీ, ఐటీ, సీబీఐ సంస్థలను బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నాయకులపైకి ఉసిగొల్పి వారి పార్టీలను నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం ఇప్పటికే దేశంలోని పలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందని.. పదేండ్ల కాలంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు.

దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు రూ.425 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను నేడు రూ.1150 పెంచారని.. అంతేకాకుండా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నదన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు షాబా ద్ దర్శన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాణెయ్య, ఎంపీటీసీ రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు వీరభద్రస్వామి, వెం కట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, నాయకులు రాజు, రవీందర్‌రెడ్డి, రాజుగౌడ్, మహేందర్ రెడ్డి, కుమార్‌యాదవ్, జైపాల్‌రెడ్డి,బాల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఆర్‌ఎస్‌పీ సపోర్టర్స్‌కు సంబంధించిన ఫ్లెక్సీని విడుదల చేస్తున్న ఆర్‌ఎస్‌పీ సపోర్టర్స్ మీట్ ఆఫ్ టీం ఆర్గనైజర్ శ్రీధర్ గోవింద్

# ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలి

### ఆర్‌ఎస్‌పీ సపోర్టర్స్ మీట్ ఆఫ్ టీం ఆర్గనైజర్ శ్రీధర్ గోవింద్

ఆమనగల్లు(మాడ్గుల), మార్చి 29 : బీఆర్‌ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపునకు కృషి చేయాలని ఆర్‌ఎస్‌పీ సపోర్టర్స్ మీట్ ఆఫ్ టీం ఆర్గనైజర్ శ్రీధర్ గోవింద్ అన్నారు. శుక్రవారం మాడ్గుల మండలంలోని నాగిళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు సేవ చేయాలన్న సదుద్దేశంతోనే ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అత్యున్నత పదవిని వదిలి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. అలాంటి వ్యక్తిపై కొంతమంది నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని సూచించారు. శుక్రవారం నుంచే ఆర్‌ఎస్‌పీ సపోర్టర్స్ మీట్ ఆఫ్ బృందం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయన్నారు. ఇందులో భాగంగానే పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రవీణ్‌కుమార్‌ను ఎందుకు ఎంపీగా గెలిపించాలో ఓటర్లకు క్షుణ్ణంగా వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని పార్టీలకతీతంగా సక్సెస్ చేయాలన్నారు. అనంతరం ఆర్‌ఎస్‌పీ సపోర్టర్స్‌కు సంబంధించిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు.

# 50% దాటలే..!

- పన్ను వసూళ్లలో పెద్దఅంబర్‌పేట వెనుకంజ
- కేవలం ఫిబ్రవరి, మార్చిలోనే అధికారుల పరుగులు
- పెద్ద పద్దులే రూ.5 కోట్ల వరకు బకాయిలు

పెద్దఅంబర్‌పేట, మార్చి 29 : ఇంటి పన్ను వసూళ్లలో మున్సిపాలిటీ వెనుకబడింది. 2023-24 ఆర్థిక సంవత్సర లక్ష్యంలో ఇప్పటివరకు సగం పన్నులు కూడా వసూలు కాలేదు. వందమందికి చెందిన పెద్ద పద్దులే రూ.5 కోట్ల వరకు బకాయిలుగా ఉన్నాయి. మరోవైపు ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే అధికారులు పన్ను వసూళ్లపై దృష్టి పెట్టారనే విమర్శలున్నాయి.



శుక్రవారం పన్ను వసూలు చేస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి, మేనేజర్ కిరణ్

### టార్గెట్‌లో సగం కూడా చేరుకోలేదు..

ఆర్థిక సంవత్సరం మరో రెండు రోజుల్లో ముగియనున్నది. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.14.48 కోట్ల పన్నులను వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో గత బకాయిలు రూ.8 కోట్ల వరకు ఉన్నాయి. మొత్తం ఆర్థిక సంవత్సరం పన్నులు, బకాయిలు కలిపి మొత్తం రూ.14.48 కోట్లు వసూలు చేయాలనేది టార్గెట్. ఇప్పటివరకు మున్సిపల్ అధికారులు రూ.7కోట్లు వసూలు చేశారు. ఈ లెక్కన లక్ష్యంలో 50 శాతం కూడా దాటలేదు. మున్సిపాలిటీలోని పెద్దఅంబర్‌పేట, కుంట్లూరు, పసుమాముల, తట్టిఅన్నారంలో అధికారులు బృందాలుగా విడిపోయి పన్ను వసూళ్లు చేస్తున్నారు. అయితే అధికారులు ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే వసూళ్లపై దృష్టి సారించారని.. అంతకుముందు వారు చర్యలు తీసుకోలేదని.. పన్ను వసూళ్లలో వెనుకబడేందుకు ఇదీ ఓ కారణమనే విమర్శలున్నాయి. గుడ్‌ఫ్రైడే రోజు సైతం మున్సిపల్ అధికారులు పన్ను వసూలు చేశారు.

### పెద్ద బకాయిలే ఎక్కువ

మున్సిపాలిటీ అధికారులు పన్ను వసూలు చేయడంలో వెనుకబడ్డారు. పాత బకాయిలతో కలిపి మున్సిపాలిటీలో మొత్తం రూ.14.48 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, టార్గెట్‌ను చేరుకునేందుకు పెద్ద పద్దులు అడ్డుగా మారాయి. ఇప్పటివరకు రూ.7కోట్ల పైచిలుకు వసూలయ్యాయి. పెద్ద పద్దులు చెల్లించాల్సిన వారిపై అధికారులు ఒత్తిడి తీసుకొచ్చినా వసూలు కావడంలేదు. మున్సిపాలిటీలోని కేవలం వంద మందికి చెందిన బకాయిలే రూ.5 కోట్ల వరకు ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు.



ఎగ్జిబిషన్‌లో వస్తువులను పరిశీలిస్తున్న బోర్డు సీఈవో మధుకర్‌నాయక్

# జింఖానాలో హునార్ మహోత్సవ్

### 12 రోజులపాటు కొనసాగనున్న ప్రదర్శన... ఎంట్రీ ఉచితం

ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న హునార్ మహోత్సవ్ ఎక్స్‌పో గాంధీ స్మృతిదర్శన్ సమితి, న్యూఢిల్లీ సహకారంతో నగరంలోని జింఖానా మైదానంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైనది. జింఖానా గ్రౌండ్‌లో 12 రోజులపాటు జరుగనున్న ఈ ప్రదర్శనను సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్‌నాయక్ ప్రారంభించారు. 25 కంటే ఎక్కువ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 350 మంది కళాకారులు, చేతివృత్తుల వారిని కలిగి ఉన్న హునార్ మహోత్సవ్ ఎక్స్‌పో వివిధ రకాల వస్తువులను అందిస్తుందని తెలిపారు. గాంధీ స్మృతి దర్శన్ సమితి వైస్ చైర్మన్ విజయ్ గోయెల్ మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ కేవలం ప్రదర్శన మాత్రమే కాదని చెప్పారు. ఈ ప్రదర్శన సందర్శకులకు ఎలాంటి ప్రవేశ రుసుం లేదని పేర్కొన్నారు. -కంటోన్మెంట్, మార్చి 29



క్యాన్సర్ రోగులకు

# నొప్పి నుంచి ఉపశమనం కలిగించాలి

క్యాన్సర్ రోగుల్లో నొప్పి నిర్వహణ అనేది చాలా ముఖ్యమైన అంశమని ప్రముఖ పెయిన్ ఫిజీషియన్ డాక్టర్ విజయ్‌భాస్కర్ బండికట్ల అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని హోటల్ దసపల్లాలో ఇండో బ్రిటీష్ అడ్వాన్స్‌డ్ పెయిన్ క్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో డా.బండికట్ల పాల్గొని ప్రసంగించారు. క్యాన్సర్ రోగులు దురదృష్టవశాత్తు తీవ్రమైన నొప్పిని అనుభవిస్తున్నారని, ముఖ్యంగా వ్యాధి అడ్వాన్స్‌డ్ దశలో ఉన్న వారు ఈ నొప్పికి గురవుతున్నారన్నారు. ఇలాంటి రోగులకు నొప్పి నుంచి ఉపశమనం కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, దీనికి సంబంధించి ఇప్పటికే ఎన్నో రకాల నొప్పి నిర్వహణ పద్ధతులు అందుబాటులోకి వస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డా.సెంథిల్, డా.గాయత్రి, పలువురు క్యాన్సర్ వైద్యనిపుణులు పాల్గొన్నారు. -సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ)

# టెట్ అర్హత ఫీజును తగ్గించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 29 : టెట్ అర్హత పరీక్షా ఫీజును తగ్గించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పెరుమల ఏడుకొండలు, సురేశ్‌గౌడ్, గాజుల నవీన్, బద్రి, జాల లాలు, రాజశేఖర్, మహేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం

### 6న ఆదిబట్ల

# చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

- వచ్చే నెల 4న 15 మంది కౌన్సిలర్లకు నోటీసుల జారీ
- చైర్మన్‌గా మర్రి నిరంజన్‌రెడ్డికి లైన్ క్లియర్..!
- వైస్ చైర్మన్ పదవికి తీవ్ర పోటీ

ఆదిబట్ల, మార్చి 29 : ఎట్టకేలకు హైకోర్టు జోక్యంతో ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ పావులు కదుపుతున్నది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంకకు, ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణకు రాష్ట్ర ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఖాళీ కావడంతో మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

### ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

సొంత పార్టీ నాయకులు సహకరించకపోవడంతో ఆదిబట్ల మున్సిపాలిటీ నూతన చైర్మన్‌గా పదవిని అధిష్ఠించేందుకు మర్రి నిరంజన్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌గా ఉంటూ సొంత పార్టీకి చెందిన చైర్‌పర్సన్ కొత్త ఆర్తికపై మిగతా పార్టీల సభ్యులతో కలిసి అవిశ్వాసాన్ని పెట్టించాడు. ఈ విషయాన్ని ఆమె పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లడంతో అతడిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అయినా నిరంజన్‌రెడ్డి భయపడకుండా హైకోర్టును ఆశ్రయించాడు. రెండు నెలల 15 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించలేదని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న హైకోర్టు వెంటనే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు ఓటింగ్ నిర్వహించాలని ఆదేశించడంతో కలెక్టర్, మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### కలెక్టర్ ఉత్తర్వులు జారీ

హైకోర్టు ఆదేశాల మేరకు వచ్చే నెల ఆరో తేదీన ఉదయం ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్, మధ్యాహ్నం వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కలెక్టర్ మున్సిపల్ అధికారులకు ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఇందుకు సంబంధించి ఏప్రిల్ నాల్గో తేదీన మున్సిపల్ కౌన్సిలర్లకు అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు.

### 6న ప్రత్యేక సమావేశం



కలెక్టర్, ఎన్నికల కమిషన్, ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల నాల్గో తేదీన 15 మంది కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేస్తాం. ఏప్రిల్ 6న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు అవసరమైన సమావేశం ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

-బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదిబట్ల

### నూతన చైర్మన్‌గా మర్రి నిరంజన్‌రెడ్డి..!

ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ అయిన మర్రి నిరంజన్‌రెడ్డికి రూటు క్లియర్ అయినట్లు సమాచారం. బీఆర్‌ఎస్‌కు చెందిన వైస్ చైర్‌పర్సన్ కళమ్మపై అవిశ్వాసం పెట్టి ఆమెను పదవి నుంచి తొలగించడంతో.... వైస్ చైర్మన్ పదవికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి తీవ్ర పోటీ నెలకొన్నది. కాంగ్రెస్ నుంచి మర్రి అర్చన, కామండ్ల యాదగిరి..బీఆర్‌ఎస్ నుంచి కళమ్మ, మహేందర్, బీజేపీ నుంచి పొట్టి రాములు పోటీలో ఉన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్ని కకు మరో వారం రోజుల సమయం ఉన్నది.

### సొంత పార్టీ వారే అడ్డుపడ్డారు..

సొంత పార్టీ వారే చైర్మన్‌గా కాకుండా అడ్డుపడ్డారు.. అందులో రాష్ట్ర మంత్రులు కూడా ఉన్నారు. ఎవరికి తలవంచను. నా వెంట 13 మంది కౌన్సిలర్లు ఉన్నారు. హైకోర్టు జోక్యంతో అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏప్రిల్ 6న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు.



-మర్రి నిరంజన్‌రెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్

# మెట్రో రైలు ప్రాజెక్టు అద్భుతం



ఉప్పల్ మెట్రో రైలు ప్రాజెక్టులోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఫ్రెంచ్ రాయబారి డాక్టర్ థియెరీ మాథ్యూ బృందం

- ఫ్రెంచ్ రాయబారి థియెరీ మాథ్యూ

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును ఫ్రెంచ్ రాయబారి బృందం ప్రత్యేకంగా పరిశీలించింది. భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి డాక్టర్ థియెరీ మాథ్యూ ఆయన బృందానికి ఎల్అండ్‌టీ మెట్రో రైల్ లిమిటెడ్ అధికారులు శుక్రవారం స్వాగతం పలికారు. ఉప్పల్‌లోని మెట్రో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. మెట్రో రైల్ నెట్ వర్క్‌కు సంబంధించిన రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల భద్రత, రియల్ టైమ్ సిస్టమ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాల నిర్వహణకు ఇది సెంట్రల్ హబ్‌గా వ్యవహరిస్తుందని మెట్రో అధికారులు వివరించారు. పట్టణ ప్రాంత రవాణా విభాగంలో సాంకేతిక పురోగతికి నిదర్శనమైన హైదరాబాద్ మెట్రో రైల్వే వ్యవస్థ ఎంతగానో ఆకట్టుకున్నదని ఫ్రెంచ్ రాయబారి థియెరీ మాథ్యూ తెలిపారు. భవిష్యత్తులోనూ కలిసి పనిచేసేందుకు, సుస్థిరమైన అర్బన్ మొబిలిటీ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేసేందుకు పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు మాథ్యూ బృందం దోహదం చేస్తుందని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్అండ్‌టీ మెట్రో ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానానికి అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తున్నదని, పరస్పర సహకారంలో కలిసి పనిచేసేందుకు ఇలాంటి పర్యటనలు తోడ్పడుతాయన్నారు. ఫ్రెంచ్‌కు చెందిన కంపెనీ కియోలిస్ మెట్రో రైళ్ల నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు.



అభివాదం చేస్తున్న గోపీ, ప్రొఫెసర్ ప్రభంజన్, తదితరులు

# ఇచ్చిన హామీని విస్మరించిన సీఎం

ఖైరతాబాద్, మార్చి 29 : ఎన్నికల ముందు వంద రోజుల్లో తమ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక తమ సామాజికవర్గాన్ని విస్మరించారని బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గోపీ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డాక్టర్ చెల్లప్ప కమిషన్ సిఫారసును పరిగణలోకి తీసుకుంటామని, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం వంద రోజులు దాటినా. తమకు ఇచ్చిన మాట ఊసెత్తడం లేదన్నారు. అనంతరం సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తే కేంద్రం పట్టించుకోలేదన్నారు. ఈ సమావేశంలో రాజేశం, నర్సయ్య, అంజయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.